క్లుప్తంగా

క్రీడాకారులకు కిట్ల పంపిణీ



క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న నేతలు

కోట: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను పురస్కరించుకుని కొత్తపాళెం సచివాలయం పరిధిలో క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. క్రీడా కిట్లను శనివారం వైఎస్సార్ సీపీ నాయకుడు నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. క్రికెట్, షటిల్, వాలీబాల్ క్రీడాసామగ్రిని అందజేశారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రజనీకాంత్

ఓజిలి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుంచి 14 రకాల పథకాలను అమలు చేస్తున్నామన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని తెలిపారు. సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మోహన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన, ఉద్యానవన, వ్యవసాయశాఖ అధికారులు శారద, విజయలక్ష్మి, ఏపీఎం నిర్మలమ్మ, ఏపీఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 12.929 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 12.929 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 110 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

10న మండల స్థాయి క్రీడా పోటీలు

పెళ్లకూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో భాగంగా ఈనెల 10వ తేదీన మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్రస్థాయి అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మండల స్థాయి పోటీలు నిర్వహించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ఆధారంగా చెంబేడు, శిరసనంబేడు, కానూరు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాలను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ అన్నపూర్ణరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

చిల్లకూరు: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఈఓపీఆర్డీ మాణిక్యం తెలిపారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లె సచివాలయం పరిధిలోని నెలబల్లి, బూదనం గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసి, అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అందిస్తుందని, వీటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతోపాటు కేంద్రం అందించే పథకాలకు అర్హులందరూ అందుకోవచ్చని అన్నారు. బీజేపీ నాయకులు బైరప్ప, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకొల్లులో 104 వైద్యశిబిరం



కేస్ షీట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రకళ

దొరవారిసత్రం: మండలంలోని ఏకొల్లులో శనివారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. షుగర్, బీపీ వంటి కూడా వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడిన మందులను పంపిణీ చేశారు. అంతేకాకుండా గర్భిణులకు పరీక్షలు చేసి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ చంద్రకళ, హెల్త్ విజిటర్ మైథిలీ, సిబ్బంది కిరణ్, మౌనిక, సుధాకర్, శ్రావణి పాల్గొన్నారు.

మద్యం కేసులో ఒకరి అరెస్టు

నాయుడుపేటటౌన్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రఘునాథ్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. పట్టణంలో స్వర్ణముఖి కాజేవే సమీపంలో రహదారిపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో తిమ్మాజి కండ్రిగకు చెందిన యాకసిరి సునీల్‌కుమార్ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఎడ్ల బండి.. ఏమైపాయే!

ఒకప్పుడు ఎడ్లబండి ఉండి..వ్యవసాయం బాగా సాగితే మోతుబరిగా చెప్పుకునేవారు. ఎకరం భూమి ఉన్న రైతుకు సైతం ఒక ఎడ్ల బండి ఉండేది. బండి కట్టుకుని ఇంటిల్లిపాది అందులో కూర్చుని పొలానికి వెళ్లేవారు. బండ్లు ఉంటే ఇబ్బందులుండవని నాడు భావించేవారు. కానీ ఇప్పుడు ఎడ్లబండ్లు కనుమరుగయ్యాయి. వంద ఎకరాలున్న కర్షకులు సైతం ఎడ్లబండ్లను పెట్టుకోవడం లేదు. అన్ని పనులు యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. కనుమరుగవుతున్న ఎడ్లబండ్లపై ఆదివారం ప్రత్యేక కథనం.

- యంత్రాలకు చేరువ
- అద్దె రవాణా సాధనాలే దిక్కు



నేలపట్టు గ్రామంలోని పాఠశాల వద్ద నిరుపయోగం ఉన్న ఎడ్ల బండి



ట్రాక్టర్లతో పనులు చేస్తున్న రైతులు

మండలం	: దొరవారిసత్రం
రెవెన్యూ గ్రామాలు	: 45
సాగు విస్తీర్ణం	: 12వేల ఎకరాలు
సన్న, చిన్నకారు	
రైతుల సంఖ్య	: 3,100
మోతుబరులు	: 800
ట్రాక్టర్ల సంఖ్య	: 450పైన

దొరవారిసత్రం: పల్లెలంటే పచ్చని పొలాలు కాదు.. పశువు సంపద.. కాలుష్య రహిత రవాణా సాధనాలు.. మంచి వాతావరణం కూడా. ఒకప్పుడు వ్యవసాయంలో ప్రతి పనికీ ఎండ్ల బండ్లే ప్రధాన ఆధారం. ఎడ్ల బండ్లు అన్నదాతకు వెన్ను దన్నుగా నిలిచేవి. ఒకప్పుడు ప్రయాణం సాగించాలన్నా.. రవాణా కోసమైనా.. రైతుల పండించిన పంట దిగుబడుల సైతం తరలించాన్నా... ఎడ్ల బండ్లపైనే అందరూ ఆధారపడేవారు. అయితే ప్రస్తుతం ఏ గ్రామంలోనూ ఇలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. మారిన పరిస్థితులతో వ్యవసాయంలోనూ యాంత్రీకరణ పెరుగుతోంది. ఫలితంగా ఎడ్లబండ్లు కనుమరుగువుతున్నాయి.

పెళ్లికైనా..పేరంటానికైనా బండిపైనే ప్రయాణం

అప్పట్లో రవాణా వ్యవస్థ లేకపోవడంతో ప్రతి ఒక్కరూ ఎడ్లబండినే రవాణా సాధనంగా వాడుకునేవారు. ముఖ్యంగా పెళ్లిళ్ల కోసం ఓ గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లడానికి ఎడ్లబండే వాహనంగా వినియోగించేవారు. అలాగే దేవాలయాలకు వెళ్లాలన్నా అందరూ బండ్లపై రవాణా సాగించేవారు. మైళ్లదూరం సైతం ఎడ్ల బండ్లపైనే వెళ్లాల్సిందే.

మంచి రవాణా సాధనం

నాడు వ్యవసాయం చేసే బడా రైతులకు ఎడ్ల బండ్లతో చాలా అవసరాలు తీరేవి. ఏ అవసరం వచ్చినా, ఆపద వచ్చినా ఎడ్ల బండిపై వెళ్లేనే పరిస్థితి ఉండేది. దీంతో ఎడ్లబండ్లు నాడు మంచి రవాణా సాధనంగా ఉండేవి. అయితే ప్రస్తుతం ఎక్కడ చూసిన ట్రాక్టర్లుతోనే వ్యవసాయ పనులు చేస్తున్నారు. దీనికితోడు ఇంటికో ఆటో, మోటార్ సైకిల్, కారు తదితర సాధనాలు విస్తృతంగా ఉన్నాయి. దీంతో ఎడ్ల బండ్లతో అవసరం లేకుండా పోయింది. దీంతో దొరవారిసత్రం మండలంలో పూర్వ కాలంలో ప్రతి రైతు ఇంటా ఉండే కాడెద్దులు, ఓ బండి నేడు లేవు. కాగా పాతికేళ్ల ముందు కూడా ప్రతి గ్రామంలో 3 నుంచి 5 జోడెద్దులతో పాటు ఎడ్లబండ్లు దర్శనమిచ్చేవి. నేడు ఎక్కడా అవి కనిపించడం లేదు. ప్రస్తుతం మండలంలోని నేలపట్టు, ఆనేగొట్టం, తిమ్మనాయుడుకండ్రిగ తదితర ప్రాంతాల్లో ఐదు ఎడ్లబండ్లు మాత్రమే ఉన్నాయి. అవి కూడా నిరుపయోగంగా చెట్ల కింద పడి ఉన్నాయి. దీంతో ఈతరం పిల్లలకి ఎడ్ల బండి ఏలా ఉంటుందో తెలియని పరిస్థితి.

16 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు

మండలంలోని 45 గ్రామాల్లో సుమారు 800 మంది మోతుబరి రైతులు, 3,100 మంది సన్న, చిన్నకారు రైతులు ఉన్నారు. వీరందరూ సుమారు 12 వేల ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం రైతులు సుమారు 450 ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. మోతుబరి రైతులు మాత్రం అధిక మొత్తంలో పొలం ఉండడంతో యంత్రాలను కొనుగోలు చేసుకుని వ్యవసాయం చేస్తున్నారు. వారిలోనూ ఎక్కువ శాతం మంది అద్దె పరికరాలపై ఆధారపడుతున్నారు. సన్నకారు రైతులు మాత్రం యంత్రాలను అద్దెకు తీసుకోవాల్సి వస్తోంది.

చిన్న, సన్నకారు రైతులకు ఇక్కట్లు

చిన్న, సన్నకారు రైతులు ఎడ్లబండ్లు లేక, వ్యవసాయ పనులు సకాలంలో సాగక ఇక్కట్లు పడుతున్నారు. చిన్న, చిన్న కమతాలు ఉన్న రైతులు సైతం ట్రాక్టర్లు, రోటావేటర్లు, ఇతర యంత్రాలపై ఆధారపడుతున్నారు. స్థానికంగా దొరకని కొన్ని యంత్రాలను ఇతర ప్రాంతాల నుంచి కూడా నెలవారీ అద్దెకు తెచ్చుకుని వ్యవసాయ పనులకు ఉపయోగించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ఎడ్లబండ్లు లేక వ్యవసాయం కుంటుపడుతుంది. సమయానికి అద్దె యంత్రాలు దొరక్క వ్యవసాయ పనులు సాగడం లేదు.

ట్రాక్టర్లతో వేగంగా పనులు



ఎడ్లబండ్లు అన్ని పనులకు ఉపయోగపడిన వ్యవసాయ పనుల నుంచి ఎద్దులతో దుక్కుల పనులు అన్ని నెమ్మదిగా సాగేవి. ఇప్పుడు ట్రాక్టర్లు రావడంతో ప్రతి పని వేగంగా సాగుతుంది. దీంతో సమయం వృథా కాదు.

– జీ. ప్రభాకర్‌రెడ్డి, బూదూరు గ్రామం

సులువైన రవాణా



ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చినందున రైతులకు అవసరమైన ప్రతి అవసరం దీంతోనే సులువుగా తీరుతుంది. అప్పటిలో ఎక్కడకు వెళ్లాన్నా ఎండ్ల బండ్లపైనే ప్రయాణం ఎంతో కష్టంగా ఉండేది. ఇప్పుడు ట్రాక్టర్లు వచ్చినందున వ్యవసాయ పనులన్నీ వేగంగా చేసుకోగలుతున్నాం.

–షేక్. సుభాన్, వేణుంబాకం

చందనాలంకరణలో లక్ష్మీనరసింహుడు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి శనివారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకం, తిరుప్పావై, చందన అలంకరణ, శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారిని బంగారు గరుడ వాహనంపై కోన మాఢవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామివారిని దర్శించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పెంచల కోన వీధులు గోవిందనామస్మరణలతో మార్మోగాయి.



శాంతి హోమం చేస్తున్న అర్చకులు

జాతీయ స్థాయి హాకీ పోటీలకు గూడూరు క్రీడాకారులు



హనుమంతు, యశ్వంత్

గూడూరురూరల్ : పంజాబ్‌లో ఈ నెల 10 నుంచి నిర్వహించనున్న జాతీయస్థాయి హాకీ పోటీలకు గూడూరుకు చెందిన క్రీడాకారులు యశ్వంత్, హనుమంతు ఎంపికై నట్లు కోచ్ దీపక్ ఆకాష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్ సత్తా చాటి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

మాట తప్పని నేత జగనన్న



లబ్ధిదారురాలకు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

దొరవారిసత్రం: ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన.. మాట తప్పని నేత జగనన్న అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం మండలం పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ పింఛన్ కానుకను ప్రారంభించి, పింఛన్ నగదును లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ డీవీ సత్రం మండలం వరకే సుమారు 4,983 వేలు మంది పింఛన్‌దారులకు నెలకు రూ.1.49 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎన్నికలు దగ్గర పడడంతో చంద్రబాబునాయుడుతో కలిసి తెలుగు తమ్ముళ్లు సైతం నెరవేర్చిలేని హామీలిస్తూ గ్రామాల్లో డప్పులు కొడుతున్నారన్నారని, ఇవేవి నమ్మే పరిస్థితితో ప్రజలు లేరన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చినందునే నేడు ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లి ఓట్లు అడిగే హక్కు తమకే ఉందన్నారు. అదే ధైర్యంతో చంద్రబాబునాయుడు ప్రజలను ఓట్లు అడగగలరా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ రఘురామయ్య, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, సచివాలయం సిబ్బంది, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



పంపుసెట్లు లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే

జలకళ పంపు సెట్ల పంపిణీ

దొరవారిసత్రం మండలానికి వైఎస్సార్ జలకళ కింద 25 మంది రైతులకు మంజూరైన పంపుసెట్లను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిలివేటి పరామర్శ

నాయుడుపేటటౌన్: మండలంలోని చిలమాత్తురులో వైఎస్సార్ సీపీ నాయకుడు ఎం అనంతరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శనివారం పరామర్శించారు. అనంతరావు తల్లి హనుమాయమ్మ శనివారం మృతి చెందడంతో వారి నివాసనికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నేతలు టీ సుబ్రహ్మణ్యం రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పీ రఘు, ఎం సురేష్, ఆర్ వెంకట కృష్ణయ్య ఉన్నారు.

భూమనతో నేదురుమల్లి భేటీ

వెంకటగిరిరూరల్: వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి టీటీడీ ఛైర్మన్ భూమన కరణాకరరెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని శనివారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిసిశారు. ఈ సందర్భంగా వారికి మొక్కలు బహూకరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.





టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి మొక్కను బహూకరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డికి..

మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దీపిక

నాయుడుపేటటౌన్: సంక్రాంతి పండుగల సందర్భంగా మహిళలకు క్రీడా పోటీలను నిర్వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ కే దీపిక సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మెప్మా అధికారులు, ఆర్పీలతో చైర్ పర్సన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ సంక్రాంతి పురస్కరించుకుని మహిళలకు వివిధ ఆటల పోటీలను నిర్వహించేలా చర్యలు చేట్టినట్లు తెలిపారు. స్వర్ణముఖి నదిలో ఈ నెల 16 తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఏటి పండుగ వేడుకల సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా పలు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో ఆర్పీలు వారి పరిధిలోని పొదుపు మహిళలతో పాటు స్థానిక మహిళలు అధిక సంఖ్యలో ఆటల పోటీల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు. ఈ నెల 9 తేదీ నుంచి రెండు రోజులు పాటు స్వర్ణముఖి నది వద్ద క్రీడాపోటీలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. విజేతలకు ఏటి పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేస్తామన్నారు. మెప్మా సిటీ మేనేజర్ ఎస్ సోమ కుమార్, సీఓ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గూడూరురూరల్: కేంద్ర ప్రభుత్వం అందించే 17 రకాల సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ జితేంద్రకుమార్ కోరారు. గూడూరు రూరల్ పరిధిలోని తిప్పవరప్పాడు, కొమ్మనేటూరు గ్రామాల్లో శనివారం కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను నేరుగా పొందే వీలుందని, దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బేబి రోహిణి, పీ వెంకటమ్మ, నాయకులు గోపాల్ పాల్గొన్నారు.

నాలుగు వాహనాల సీజ్





స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్

సైదాపురం: అడవిలో అక్రమంగా ఖనిజ సంపదను తవ్వి తీస్తున్న రెండు జేసీబీలు, రెండు ట్రాక్టర్లను శనివారం నెల్లూరు అటవీ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు రేంజర్ మాల్యాద్రి మాట్లాడుతూ సైదాపురం అటవీ ప్రాంతంలో గుట్టు చప్పుడు కాకుండా రెండు జేసీబీలతో తెల్లరాయిని అక్రమంగా తవ్వి రెండు ట్రాక్టర్లలో తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో తనిఖీలు చేసి, ఆ నాలుగు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

కుష్టువ్యాధి సర్వే తనిఖీ



కలువాయి దళితవాడలో కుష్టువ్యాధి సర్వేని పర్యవేక్షిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

కలువాయి: మండలంలో జరుగుతున్న కుష్టువ్యాధి సర్వేని జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి శనివారం తనిఖీ చేశారు. కలువాయి దళితవాడ, కుల్లూరులో సర్వేని ఆయన తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. ఆయన మాట్లాడుతూ 2027 నాటికి కుష్టువ్యాధి రహిత దేశంగా మార్చాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యాధి గ్రస్తులను గుర్తించి, వారికి తగిన చికిత్సలు అందజేస్తామన్నారు. అనంతరం కలువాయి, కుల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోని ల్యాబ్‌లు, ఫార్మసీలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలువాయి, కుల్లూరు పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ ఎం.రామకుమారి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ అన్వర్‌బాషా పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



నాయుడుపేటటౌన్: రాజగోపాలపురం సచివాలయం పరిధిలో పెంచిన రూ.3 వేలు పింఛన్లను వైఎస్సార్ సీపీ జేసీఎస్ అర్బన్ కన్వీనర్ చదలవాడ కుమార్, కౌన్సిలర్ సాధు శాంతి శనివారం పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు సీ వెంకటేశ్వర్లు, పీ నాగార్జున, బంగారుబాబు, కే ఆశోక్ కుమార్ తదితరులు పింఛన్లు పంపిణీ చేశారు.

సామాజిక న్యాయం ఘనత జగనన్నదే

రాపూరు: దేశంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సామాజిక న్యాయం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్‌సీపీ నాయకుడు పీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. తెలుగుగంగ అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. బస్సుయాత్రకు భారీగా జనం తరలివచ్చి, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెంట తామున్నామని నిరూపించారన్నారు. యాత్రకు జనాలు లేరని కొన్ని పత్రికలు రాయడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



సరుకులు, పాత్రలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

దొరవారిసత్రం: మండలంలోని పూలతోట ఎస్సీ కాలనీలో జరిగిన అగ్నిప్రమాద బాధితుడు శ్రీనివాసులు కుటుంబానికి కృష్ణా ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంయుక్తంగా వంట పాత్రలు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. నాలుగు రోజుల కిందట పూలతోట ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసులుకు చెందిన పూరిల్లు కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఆ సంస్థలు బాధిత కుటుంబానికి సాయం అందజేశారు.

పచ్చిశెనగ పంట పరిశీలన



పచ్చిశెనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ ప్రతాప్

కలువాయి: మండలంలోని పలు గ్రామాల్లో సాగులో ఉన్న పచ్చిశెనగ పంటను ఏఓ ప్రతాప్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చవటపల్లె, వెరుబొట్లపల్లె, కేశమనేనిపల్లె, దాచూరు, పర్లకొండ, పెరంకొండ, దాసరిపల్లె, చింతలాత్మకూరు, తోపుగుంట గ్రామాల్లో 1300 ఎకరాల్లో పంట సాగులో ఉందన్నారు. ఈ పంటకు అక్కడక్కడా వేరుకుళ్లు తెగులు ఆశించిందని చెప్పారు. వేరుకుళ్లు తెగులు నివారణకు శాఫ్ మందు రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచ్‌కారి చేయాలన్నారు. వారం తరువాత మరోమారు పిచ్‌కారి చేయాలని సూచించారు. జాతీయ పోషకాహార భద్రతా పథకంపై చీపినాపిలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటరత్నం పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని అటకానితిప్ప–పేర్నాడు, తడ మండలంలోని వేనాడు గ్రామాల రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తుపాను కారణంగా దెబ్బతిన్న అటకానితిప్ప–పేర్నాడు రోడ్డు మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరణ కోసం అధికారులతో చర్చించామన్నారు. వేనాడు, పేర్నాడు గ్రామాలకు రూ. 50 కోట్లతో బీటీ లేక సీసీ రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిల్‌కుమార్ రెడ్డి, పార్టీ నాయకుడు జే వేణు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

సైదాపురం(వెంకటగిరి): పట్టణంలోని నాగులగుంటపాళేనికి చెందిన ఆర్ రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు శనివారం వైఎస్సార్ బీమా ఆర్థిక సాయం అందజేశారు. రాజ్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబానికి తక్షణ సాయం క్రింద వైఎస్సార్ బీమా ద్వారా రూ. 10 వేలు నగదును వైఎస్సార్‌సీపీ నేతలు కల్లు సతీష్‌కుమార్, సచివాలయం సిబ్బంది లక్ష్మీనారాయణ అందజేశారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగార్జున సాగర్

దక్కిలి: వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. దక్కిలి మండలంలో సాగులో ఉన్న వరి పంటను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు ఎరువులు మోతాదుకు మించి వేయకూడదని తెలిపారు. పంటల సాగులో అధికారులు సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు.

ఘనంగా వికసిత్ భారత్



గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న అధికారులు, నేతలు

సైదాపురం: మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని సర్పంచ్ వీ శారద అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఏఓ హైమావతి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఏపీఎం రాధ మాట్లాడుతూ పొదుపు సభ్యులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం పీకేఎస్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ద్వారా పలువురికి గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, డీజీఎం అశ్వినీకుమార్ ఆగర్వాల్, సీనియర్ సేల్స్ అధికారి అశోక్‌కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, బీజేపీ నేత చాంద్‌ఖాసీం, వైద్యాధికారి జనార్ధన్‌రావు, ఏఓ హైమావతి పాల్గొన్నారు.

కూరగాయల అలంకరణలో వేంకటేశ్వరస్వామి



వెంకటగిరిరూరల్: పట్టణంలోని కర్ణకమ్మ వీధిలో ఉన్న హరిహర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారికి శనివారం కూరగాయలతో అలంకరించారు. ధనుర్మాసం శనివారం సందర్భంగా వేంకటేశ్వరస్వామివారికి పులిహోర, స్వీట్లు, పప్పు చెక్కలు, కజ్జికాయలు, తులసిమాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని, స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.